17 వరకు ఒంటి పూట బడులు

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ఈ నెల 12వ తేదీ నుండి పున్హ ప్రారంభం కానున్న విషయం విదితమే. జిల్లాలోని అన్ని పాఠశాలలు ఈ నెల 12వ తేదీ నుండి 17 వ తేదీ వరకు ఒంటి పూట పని చేస్తాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుండి 17వ తేదీ వరకు ఉదయం 7.30 గంటల నుండి 11.30 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయని చెప్పారు. ఈ మేరకు ఒంటి పూట బడుల నిర్వహణపై పాఠశాల కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, ఇతర యాజమాన్యాల క్రింద పనిచేస్తున్న అన్ని పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. రానున్న నాలుగు, ఐదు రోజుల వరకు ఎండల తీవ్రత 40 డిగ్రీలపైన ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రభుత్వం సమయాలను మార్పు చేసిందని వివరించారు.

బడులకు పూర్తిస్థాయిలో చేరని..

జగనన్న విద్యా కానుక కిట్లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యా కానుకతో పాటు పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 12న పాఠశాలలు పున్హప్రారంభం కానున్నాయి. ఇంతవరకు పూర్తిస్థాయిలో జగనన్న విద్యా కానుక కిట్లు(జెవికె)

అందులోని పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు పాఠశాలలకు చేరలేదు. ఆదివారం సాయంత్రం వరకు ఆయా పాఠశాలలకు సంబంధించిన జగనన్న కిట్ ల సామగ్రి పాఠశాలల సిబ్బంది దగ్గరుండి తీసుకెళ్తూనే ఉన్నారు. అల్లూరి జిల్లాలో సుమారు 1లక్ష 66వేల 709 మంది విద్యార్థులకు జెవికె కిట్లు ఇస్తున్నామని డిఇఒ కార్యాలయం అధికారులు తెలిపారు. అన్ని సబ్జెక్టుల పుస్తకాలు సకాలంలో సరఫరా చేయకపోతే బోధన కుంటుపడుతుంది. మే 31 నాటికి ఇవి పాఠశాలలకు చేరాల్సి ఉన్నా కొన్ని మండలాల్లోని గోదాములకే బ్యాగులు, పుస్తకాలు పూర్తిస్థాయిలో చేరలేదని సమాచారం. ఈ విద్యా సంవత్సరంలో పలు పాఠ్య పుస్తకాలు మారాయి. 9వ తరగతికి అన్ని సబ్జెక్టుల పుస్తకాలు మారాయి. 6, 7 తరగతులకు ఇంగ్లీష్, సైన్స్, గణితం మారడంతో నూతన పాఠ్యాంశాలతో వాటిని సరఫరా చేస్తున్నారు. 6, 7 తరగతులకు సంబంధించి మారిన సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు ఇంతవరకు చేరలేదని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రచార ఆర్భాటం

గత సంవత్సరం కూడా కానుకలోని వస్తువులు అరకురగానే సరఫరా చేశారు నాసిరకం బ్యాగులు అందించారు. ఈ సంవత్సరమైనా పూర్తిస్థాయిలో వస్తువులు అందిస్తారా లేదా అన్నది అనుమానమే జగనన్న విద్యా కానుక పథకం అమలు చేస్తున్నప్పటి నుంచి ఒక సంవత్సరం కూడా పూర్తిస్థాయిలో వస్తువులు అందజేసిన దాఖలాలు లేవు. ప్రతి ఏటా వస్తువుల్లో కోత విధిస్తున్నారు. గత ఏడాది బూట్లు, సాక్షులు, బెల్టులు, డిక్షనరీలు అరకురగానే వచ్చాయి. మొదటి రోజు కొన్ని మాత్రమే పంపిణీ చేశారు. జూన్ నెలాఖరులోపు అన్ని వస్తువులు అందజేస్తామన్నారు. విద్యా సంవత్సరం పూర్తయినా పలు వస్తువులు విద్యార్థులకు అందలేదు. ఈ సంవత్సరం కూడా రాత పుస్తకాలు, బూట్లు, బ్యాగులు పూర్తిస్థాయిలో చేరే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం సరఫరా చేసిన వస్తువుల వివరాలను అధికారులు వెల్లడించలేదు.

వీలైనంత త్వరగా పంపిణీకి చర్యలు

విద్యా కానుకలోని 90 శాతం వస్తువులు వచ్చాయి. పాఠ్య పుస్తకాలు కొన్ని మాత్రమే రావాల్సి ఉంది. అవి కూడా రవాణా దశలో ఉన్నాయి. యూనిఫామ్, రాత పుస్తకాలు 90 శాతం వచ్చాయి. ఒక్కోచోట కొన్ని వచ్చాయి. మండలాలకు పూర్తిస్థాయిలో చేరాల్సి ఉంది. వీలైనంత త్వరగా మండలాల నుంచి పాఠశాలలకు పంపించడానికి చర్యలు చేపట్టాం.

ఎస్ కె సలీం బాషా
విద్యాశాఖఅధికారి
అల్లూరి జిల్లా

మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ లో ఉన్న షూస్

అరకొరే..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కానుక కింద స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, బెల్టు, బూట్లు, సాక్షులు డిక్షనరీ ఉంటాయి. అల్లూరి జిల్లాలో 1లక్ష 66వేల 709 మంది విద్యార్థులకు కిట్లు అందజేయాల్సి ఉంది. ఇంకా ఆయా వస్తువులు రావాల్సి ఉందని సమాచారం.

రోడ్డు పనులను జెడ్పిటిసి గంగరాజు పరిశీలన

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీ పరిధి బంధవలస గ్రామం నుండి పెన్నంతి వరకు రోడ్డు పనులను జడ్పిటిసి దిసరి గంగరాజు పరిశీలించారు. ఆదివారం సిపిఎం బృందంతో సందర్శించిన జెడ్పిటిసి రోడ్డు పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జెడ్పిటిసిగా గెలిచిన అనంతరం బంధవలస, పెన్నంతి, డాలింగ్ పుట్టు, మెట్టపాడు .తదితర గ్రామాలలో సందర్శించడం జరిగిందన్నారు. ఆ గ్రామాల ప్రజలు రోడ్డు సౌకర్యం కల్పించాలని తమ దృష్టికి తీసుకువచ్చారని, జిల్లా పరిషత్ నిధులు 5.లక్షలతో బందవలస గ్రామం నుండి పెన్నంతి మెయిన్ రోడ్డు వరకు మూడు కిలోమీటర్లు వరకు రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిమ్మలపాడు మెయిన్ రోడ్డు నుండి హుకుంపేట మండలం జంబువలస మీదుగా వెంగడ, మెట్టపాడు నుండి పెన్నంతి, డొంకపుటు వెళ్లాలంటే 15 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. బందవలస నుండి పెన్నంతి మీదుగా అత్యవసర పరిస్థితుల్లో తక్కువ కిలోమీటర్లలో గమ్యం చేరుకోవచున్నారు. వేంగడ మెయిన్ రోడ్డు బందవలస మార్గమధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేంగడ సర్పంచ్ చోడేపల్లి సీమ, టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో .మొస్య, వెంగడ సిపిఎం మాజీ సర్పంచ్ సివెరి. కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ .నాగులు, గ్రామస్తులు అనిల్, అప్పన్న, నర్సింగ్, ధర్మ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న గంగరాజు, నేతలు

పైపులైను పనులు చేస్తున్న గిరిజనులు

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి మద్దిగరువు గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలనే లక్ష్యంతో పంచాయతీ నిధుల తో తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు చేశామని స్థానిక సిపిఎం సర్పంచ్ సోమ్మెల. రుతు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మద్దిగరువు గ్రామంలో తాగునీటి పథకం లేదని, దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో రూ 2. లక్షలు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. మరో రెండు రోజుల్లో ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు. అమలగుడ, తేనెపుట్టి గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

బోల్తా పడిన వాహనం నుండి క్షతగాత్రులను బయటకు తీస్తున్న 108 సిబ్బంది

లోయలోకి వాహనం బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

- సురక్షితంగా బయటపడిన 12 మంది

ప్రజాశక్తి- మోతుగూడెం

అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధి మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో ఆదివారం తెల్లవారుజామున టాటా మ్యాజిక్ వాహనం బోల్తా పడింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా మార్టూరు కోడూరు, లింగాపురం గ్రామాలకు చెందిన మల్లేష్, ఇ.వరాలమ్మ, జి.లీల, ఎ.కుమారి, ఆర్.లక్ష్మి, ఎ.మాధవరావు, బి.రఘు, ఎ.మనోజ్ కుమార్, ఆర్.హారిక, ఇ.భార్గవ్, ఎ.లక్ష్మీ ప్రసాద్ తదితర 11 మంది టాటా మ్యాజిక్ వాహనంలో భద్రాచలం సీతారాముల దర్శనానికి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో కనకదుర్గ గుడి సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి 200 అడుగుల లోయలోకి బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న ఇ.వరాలమ్మ, జి.లీల, ఎ.కుమారి, ఆర్.లక్ష్మి, ఎ.మాధవరావు, బి.రఘు, ఎ.మనోజ్ కుమార్, ఆర్.హారిక, ఇ.భార్గవ్, ఎ.లక్ష్మీ ప్రసాద్‌తో పాటు డ్రైవర్ వినోద్ ప్రమాదంలో గాయపడ్డారు. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన 108 వాహనం వచ్చి క్షతగాత్రులను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగలేదు. 12 మంది చిన్నచిన్న గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మోతుగూడెం పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోయలో నుండి క్షతగాత్రులను తీసుకొస్తున్న 108 సిబ్బంది, స్థానికులు

108 వాహనంలో ప్రసవించిన దృశ్యం

108 వాహనంలో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి-అడ్డతీగల

108 వాహనంలో ఓ గిరిజన మహిళ ప్రసవించింది. అడ్డతీగల మండలం దూచర్తి గ్రామానికి చెందిన గర్భిణి కలిదిండి శాంత కుమారి శనివారం తెల్లవారుజామున పురిటి నొప్పులతో బాధపడుతుండగా సమీప బంధువులు ఆశా వర్కర్ సుధారాణి 108కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన వారు 108లో తీసుకొని వెళుతుండగా మార్గమధ్యలో డి.కొత్తూరు వద్ద వాహనంలోనే ప్రసవం జరిగింది. శాంత కుమారి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. వారిని అడ్డతీగల సిహెచ్‌సికి తీసుకెళ్లారు. ఇఎంటి అమ్మినాయుడు, పైలట్ ఎస్‌కెబి నవాజ్, ఆశా కార్యకర్త సుధారాణికి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి- విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లి గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి చల్ల భోనం ఎత్తి అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుండి 3 రోజుల పాటు డప్పు దరువులతో చలువ కుండలతో చాకలి కావడి మోస్తూ వీధి, వీధి తిరుగుతూ గ్రామస్తులు ఇచ్చే చల్దిని కుండల్లో వేసి రేఖపల్లి శివారులో సంత పాకలు దగ్గర గల గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారు వనం పోతురాజులకు నైవేద్యంగా సమర్పించడం జరిగింది. 3వ రోజు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలోని అన్ని వర్గాల మహిళ 101 నిండుకుండ నీళ్ల బిందెలతో ఊరేగింపుగా గ్రామ శివారులో గల ముత్యాలమ్మ తల్లి గుడి వద్దకు వెళ్లి ముత్యాలమ్మ అమ్మ వారికి పోతురాజు, వినాయక నూకలమ్మ అమ్మవార్లను శుద్ధి చేసి అభిషేకం చేశారు. రాత్రి 9 గంటల నుంచి మేళ్ళ తాళ్లతో గణాచారులతో పూనకాలతో డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పొలిమేరలు తిరుగుతూ నాలుగు పక్కల ముడుపులు కట్టంతో ఈ తంతు ముగిసింది. ఈ కార్యక్రమంలో రేఖపల్లి, కొర్రాజుల కొలుపు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాలను ఊరేగిస్తున్న దృశ్యం

చెట్టు కింద ఆన్లైన్ చేస్తున్న ఉద్యోగులు

సెల్ సిగ్నల్ అందక అవస్థలు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీలో మొబైల్ సెల్ ఫోన్ సిగ్నల్స్ పెద్ద సమస్యగా మారింది. నిత్యం సెల్ సిగ్నల్ కోసం మూడు కిలోమీటర్లు వెళ్తూ సిగ్నల్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. గిరిజనులు, సచివాలయం ఉద్యోగస్తులు, లోతేరు పంచాయతీ గ్రామస్తులు కొండలు గుట్టలు ఎక్కి దిగి సెల్ఫోన్ సిగ్నల్ అన్వేషణకు సిగ్నల్ పాయింట్ చెట్టు కింద వేచి ఉంటున్నారు. సచివాలయ ఉద్యోగులు వివిధ సంక్షేమ పథకాలకు నమోదు చేసేందుకు మూడు కిలోమీటర్లు దూరం వరకు ప్రయాణించి కొండపైన ఉన్న చెట్టు కింద ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంక్షేమ పథకాలు, పౌరసేవలను తప్పనిసరిగా ఆన్లైన్ చేయవలసి ఉంది. గ్రామ సచివాలయంలో సిగ్నల్స్ లేక గ్రామానికి దూరంగా వెళ్లి పనిచేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని సచివాలయ ఉద్యోగస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో పలువురు సహాయకులను నియమించింది. పౌరసేవల నుంచి సంక్షేమ పథకాల అమలు వరకూ అన్ని బాధ్యతలు అప్పగించింది. నెట్ సిగ్నల్స్‌పై దృష్టి సారించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెల్‌టవర్లు ఏర్పాటు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యూనిట్ ఫర్ ఛారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరుకు వారపు సంతలో యూనిట్ ఫర్ ఛారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివాసి విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, నోట్ బుక్స్, పెన్నులు, బూట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర చేతుల మీదుగా పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరి నిరుపేద, అనాధ బాల, బాలికలకు సుమారు 40 మందిని దత్తత తీసుకొని ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఫీజులు చెల్లించి చదివిస్తున్న ట్రస్ట్‌ను ఆయన అభినందించారు. దీంతోపాటు తల్లిపాలు అందని అనేకమంది చిన్నారులకు ఉచితంగా పాల డబ్బాలను ఈ ట్రస్ట్ అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకులోయ మయూరి రాజు, ట్రస్ట్ సభ్యులు నీలి జోఫ్సిన్, నీలి నారాయణరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సామగ్రిని అందజేస్తున్న సురేంద్ర

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా నాయకులు వెంకట్, శ్రీనివాస్

ప్రజాశక్తి- చింతూరు

పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అలంపిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20 నుండి జులై తేదీ వరకు జరుగు పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రంపేట గ్రామంలో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని, వరదలు వచ్చి నిర్వాసితులు మునిగిపోతుంటే ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. తప్పులు తడకలుగా కాంటూరు లెక్కలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. గత సంవత్సరం వచ్చిన వరదల్లో నిర్వాసితులు సర్వం కోల్పోయారని, ప్రభుత్వ మాత్రం 2000 ఇచ్చి చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. వచ్చేనెలలో మళ్లీ వరదలు వచ్చి అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఇంతవరకు కల్పించలేదని తెలిపారు. దీనిని బట్టి నిర్వాసితులను మళ్లీ వరదల్లో ముంచడానికి ప్రభుత్వం పునుకుందని అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని వీడి నిర్వాసితులకు పునరావాసం కల్పించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుండి జూలై 5వ తేదీ వరకు జరుగుతున్న మహాపాదయాత్రను నిర్వాసితులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరం కొండయ్య, పాండు సుబ్బారావు, కారం రాజయ్య, పాంద్రు పెద్దయ్య, వల్లపు పెద్ద రాములు, తమ్మయ్య, పాండు నాగార్జున, పాండు చిన్న నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్

భానుడు భగభగ

సీలేరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం భానుడు భగభగ మండిపోయాడు. 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. గత నెల రోజులుగా సీలేరులో ఉష్ణోగ్రతల్లో 34, 35, 36, 37, 38, డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు అవుతూ ఉండేది. ఆదివారం ఉదయం నుండి సూర్యుడు తన ప్రతాపం చూపించడంతో మునుపు ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా ఉష్ణోగ్రత తీవ్రతరమైంది. దీంతో మధ్యాహ్నం ఒంటిగంటకు 36, 37, 38, డిగ్రీ మధ్య ఉష్ణోగ్రత నమోదు కాగా క్రమేపీ సాయంత్రం ఐదు గంటలకు 40 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. ఎండ ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రజలు బయటికి వచ్చేందుకు సాహసించలేదు. సీలేరు నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు పచ్చని చెట్లు కింద సేదతీరి ఉష్ణోగ్రత నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఎండ, వేడి, గాల్పులు కారణంగా ఆదివారం వారపు సంతకు మారుమూల ప్రాంతాల నుంచి గిరిజనులు పెద్దగా రాలేదు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి గిరిజనులు కొంతమంది, మైదాన ప్రాంతం నుంచి ఒకరిద్దరు కూరగాయలు తెచ్చి ఆరకొరగా విక్రయించారు. ఇటు కొనుగోలుదారులు, అటు వ్యాపారులు పెద్దగా రాకపోవడంతో వారపు సంత బోసిపోయింది. వచ్చిన వారు కూరగాయలు కూడా అంతంత మాత్రమే కొనుగోలు చేసుకొని ఎండ వేడి మికి తాళలేక ఇంటిదారి పట్టారు. దీంతో సీలేరులో వారపు సంత కళతప్పింది.

కొనుగోలుదారులు, అమ్మకందారులు లేక బోసి పోయిన సీలేరు వారపు సంత

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎపిఎస్ సభ్యులు

రొట్టెలు, పళ్లు పంపిణీ

ప్రజాశక్తి- అరకు లోయ :ఆదివాసి పరిరక్షణ సమితి (ఏపీఎస్)వ్యవస్థాపకులు చట్టు మోహన్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని ఆదివారం అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుమారు 100 మంది రోగులకు రొట్టెలు, అరటి పళ్లు, మామిడి పళ్లు పంపిణీ చేశారు. జన్మదిన వేడుకల సందర్భంగా ప్రతి ఏటా రోగులకు అరటి పళ్లు పంపిణీ చేస్తున్నట్లు ఏపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చట్టు మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి పరిరక్షణ సమితి నాయకులు ఎల్. రవీంద్ర, మణికుమార్, చట్టు ప్రశాంత్ కుమార్, రాజు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాడుగుల:ఉద్యానవన శాఖ సబ్సిడీ నిధులతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సహకారంతో మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజ్ భవనాలు, కలెక్షన్ సెంటర్లకు శంకుస్థాపన నిర్వహించారు.వైఎస్ఆర్ క్రాంతి పథకం (వెలుగు ప్రాజెక్ట్) కు సంబంధించి శ్రీ మోదమాంబ గొర్రెలు, మేకలు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో సుమారు కోటి రూపాయల నిర్మాణ వ్యయంతో నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఏజెన్సీ వ్యాప్తంగా 11 మండలాల గిరిజనులు తమ వ్యవసాయ ఉత్పత్తులను అవసరం మేరకు నిలువ చేసుకునే సామర్థ్యం, ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీపీ పెదబాబు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఇటువంటి సౌకర్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కర్ శ్రీధర్, హేమంత్, దంగేటి ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :స్థానిక ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ప్రతినిధులు దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక కళాసి కాలనీ చెందిన మారెంపూడి సత్యవతి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఈ విషయం ఎన్నారై వాసవి అసోసియేషన్ ప్రతినిధి వెలగా నారాయణరావు ను సంప్రదించి ఆర్థిక సహాయం చేయాలని కోరింది. నారాయణరావు స్పందించి ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ద్వారా రూ.50వేలను ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం అందజేశారు. సదరులు అందజేశారు. స్థానిక వ్యాపారులు సుతపల్లి శ్రీకాంత్ రామకృష్ణ, మెడికల్ స్టోర్ కొప్పర్తి కుమార్ ప్రతినెల వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 వేలొప్పున అందజేస్తామని తెలిపారు.

అమిత్ షా గో బ్యాక్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: విశాఖపట్నంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనను నిరసిస్తూ నర్సీపట్నం అబీద్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి హెచ్ క్రాంతి మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 ఏళ్ల కాలంలో ఆంధ్ర రాష్ట్రానికి ఏమి చేసిందని ప్రశ్నించారు. అమిత్ షా ఏ మొహం పెట్టుకొని విశాఖపట్నంలో విజయోత్సవ సభను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మా నాయకులు సూర్యప్రభ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎల్లి రామణ, మిడ్ డే మీల్స్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ.ప్రసన్న, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, సిపిఎం నాయకులు లోవరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు కశిమిలో గడపగడపకు..

ప్రజాశక్తి-గొలుగొండ: ఈ నెల 12న మండలంలోని కశిమి గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ హాజరవుతున్నారని. నాతవరం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపి సత్యవతి హాజరు కానున్నారన్నారు.

మన్యంలో మండుతున్న ఎండలు

ప్రజాశక్తి -పాడేరు: వర్షాని ప్రకృతి ఒడిలోనూ మండే ఎండలు దహిస్తున్నాయి. మన్యంలోనూ గత రెండు వారాలుగా ఎండల తీవ్రత అధికం అయింది. గత ఐదు రోజులుగా పాడేరు ఏజెన్సీలో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వడగాల్పులు ఉక్క పోతతో మన్యం ప్రజలు కూడా వేసవి తీవ్రతను చవిచూస్తున్నారు. శనివారం అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆదివారం 41 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయింది. గత వారం రోజులుగా వర్షం జాడ కూడా కాన రాలేదు. మన్యంలో తరచూ కురిసే వర్షాలతో వేసవిలో కాస్త ఉపశమనం కలిగిస్తాయి. వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ తీవ్రత పెరగడంతో ఒక్కసారిగా మైదాన ప్రాంతాన్ని తలపించే రీతిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఎండల తీవ్రతతో ఏజెన్సీలో సాగునీటి తాగునీటి వనరులు పూర్తిగా తగ్గిపోతున్నాయి. దీంతో గిరిజనులకు ఈ వేసవిలో అవస్థలు రెట్టింపు అవుతున్నాయి. గిరిజన ప్రాంతంలో జల వనరులపైనే వేసవి తీవ్రత అధిక ప్రభావం చూపిస్తుంది. భానుడి ప్రతాపంతో మన్యంలోని మార్కెట్లు, సంతలు జనాలు లేక వెలవెల పోతున్నాయి. ఏజెన్సీలో రవాణా సౌకర్యాలు కొరత మూలంగా గిరిజనులు ఎక్కువగా పాదచారులుగానే సంచరిస్తుంటారు. వేసవి తీవ్రత అధికమవడంతో జనసంచారం బాగా తగ్గిపోయింది. ఉపాధి వ్యవసాయ పనులను గిరిజన రైతులు నిర్వర్తించుకునే వీలు లేని పరిస్థితి ఎదురయ్యింది. ఇదివరకే వేసవి దుక్కులు పూర్తి గిరిజన రైతాంగం ఖరీఫ్ వ్యవసాయ పనులు చేపట్టడం కోసం ప్రస్తుతం తొలకరి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రతి విద్యార్థికీ ప్రవేశం కల్పించాలి

ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐ టి డి ఎ పరిధిలో ఉన్న ప్రభుత్వ గురుకుల కళాశాలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించి ప్రవేశం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారావు, జిల్లా కమిటీ సభ్యుడు వరహాల ఆదివారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఉన్న 8 గురుకుల కళాశాలలో అన్ని గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రూప్ కి 40సీట్లు మాత్రమే కేటాయించడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉంటుందని, ఆదివాసీ గిరిజన బాల బాలికలు ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదువుకోవాలని ఎక్కువ ఆశ పడుతున్నారన్నారు. సీటు రాకపోతే ఇంటికే పరిమితమై ఉండిపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం గురుకులాల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన కౌన్సిలింగ్లో బాలుర 1300 వందలకు పైగా దరఖాస్తు చేసుకుంటే కేవలం 840 మాత్రమే, బాలికలు 1660 దరఖాస్తు చేసుకుంటే కేవలం 450 సీట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. అత్యధికంగా బాలికలు గురుకులాల్లో కళాశాలలు చదువు కోవడానికి ఆశపడుతున్నారన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య చూస్తేనే తెలుస్తోందన్నారు. బాలికలకు అదనంగా కళాశాలలు ఏర్పాటు చేయాలని, ఆదివాసీలు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కల్పించే విధంగా 40నుంచి 80సీట్లు కేటాయించాలన్నారు. గురుకుల కళాశాలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని పరిష్కారం చేయాలన్నారు. లేకుంటే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో కలిసి ఉద్యమం చేస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని మారు మూల ఇరగాయి పంచాయతీ బోందుగుడ గ్రామానికీ చెందిన జన్ని ప్రమీలమ్మ 10 ఏళ్ల నుంచి చర్మ వ్యాధితో భాధ పడుతోంది. కేజీహెచ్ వంటి పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్ళినా పూర్తి స్థాయిలో నయం కాలేదని తండ్రీ జన్ని దొన్ను తెలిపారు.ఈ విషయమై విశాఖపట్నం సౌత్ సబ్ డివిజన్ తపాలా శాఖలో పని చేస్తున్న లోతేరు గ్రామానికీ చెందిన కొర్ర వెంకట్ రూ.3 వేలు అందించారు. ఇరగాయి పంచాయితీ వీఆర్వో పాంగి చిట్టిబాబు రూ.2 వేలు అందజేశారు.

బాలిక వైద్యం నిమిత్తం నగదును అందజేస్తున్న వెంకట్,చిట్టిబాబు



నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక నేరెళ్ళవలస కాలనీకి చెందిన అరసవల్లి సతీష్ (28) అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అతన్ని దగ్గర్లో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎఎస్ఐ రామం కథనం ప్రకారం... శనివారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఇంట్లోని గది తలుపులు మూసివేసి ఉండడంతో భార్య తలుపు తట్టినా సతీష్ తీయలేదు. వెంటనే భార్య, కుటుంబ సభ్యులు తలుపు పగులకొట్టి లోపలకు వెళ్లారు. గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మ చేసుకుని కనిపించాడు. భార్య కొండ, ఇద్దరు పిల్లలు ఐదేళ్ల గౌతమ్, మూడేళ్ల వరుణ్, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. మృతుడు పెయింటర్‌గా పనిచేసేవాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. మతుని భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రామం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెండు దుకాణాల్లో చోరీలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలో శనివారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీలు జరిగాయి. దుకాణాల్లో నగదు లేకపోవడంతో కొన్ని సామాన్లను అపహరించుకుపోయారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలక్ట్రికల్ హార్డ్వేర్ షాపులో షట్టర్ తొలగించి రూ.500 చిల్లరను తీసుకెళ్లారు. నర్సీపేట వద్ద సాయి మార్బుల్ షాపు పైకొప్పు తొలగించి సామాన్లు తీసుకెళ్లారు. దీనిపై స్థానిక సీఐ బి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోద్యం సర్పంచ్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ మాతృమూర్తి ఆదపురెడ్డి సత్యవతి (70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అనారోగ్య కారణంగా ఆమె గత 12 రోజుల నుంచి విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందారు. ఆమె మృతితో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి సర్పంచ్ కుటుంబీకులను పరామర్శించి పార్థవదేహానికి నివాళ్లు అర్పించారు. మృతి చెందిన సత్యవతి మాజీ ఎంపీపీ ఆదపురెడ్డి సత్యనారాయణ సతీమణి. ఆమె అంతిమయాత్రలో నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రమణమ్మ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పెట్ల నారాయణమూర్తి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజబాబు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాసరావు, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని గుండంగా సన్ డే

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎండలు మండి పోతు న్నాయి. విపరీతమైన వేడి గాలులు వీయడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఆదివారం అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఫ్యాన్లు, ఏసీలు కూడా సక్రమంగా పనిచేయలేదు. ఇళ్ల వద్ద ఫ్యాన్లు వేసుకుంటే వేడిగాలులు వీచాయి. వడగాల్పులు వీయడంతో జనం బయటకు రావడానికి సాహసించ లేదు. రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వడగాల్పులకు జనం ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక నానా అవస్థలు పడ్డారు.తప్పని పరిస్థితుల్లో ప్రయాణం సాగించేవారు తగు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు సాగించారు.

గృహాల రద్దుకు నోటీసులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా జగనన్న కాలనీలు మంజూరైనా లబ్ధిదారులు వివిధ కారణాలతో నిర్మాణాలు చేపట్టక పోవడంతో అధికారులు వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు మండలంలో వివిధ గ్రామాలలో నిర్మాణాలు చేపట్టని 745 మందికి నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా జగనన్న లేఅవుట్ లో మంజూరైన లబ్ధిదారుల అధికంగా ఉన్నట్లు సమాచారం. మండలంలో నేటికీ ఇల్లు మొదలు పెట్టని లేఅవుట్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఆక్సాహెబ్ పేట, అన్నవరం, బి కే పల్లి, రామచంద్ర పాలెం, రాజుపేట, వెంకటాపురం, జల్లూరు, పందూరు, తంగేడు, గ్రామాలలో లే అవుట్ నివాసయోగ్యానికి అనుకూలంగా లేక పోవడంతో ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సుముఖత చూపలేదు. దీనికి తోడు గృహ నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలతో ఎలా నిర్మిస్తామని పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి

బంగారమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బాలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయాన్ని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ జి.మాధవి ఆదివారం సందర్శించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భర్త శివప్రసాద్, ఎంపీపీ బడుగు రమేష్, జడ్పీటీసీ వార నూకరాజు, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, ఎఎంసి చైర్‌పర్సన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకర్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, కొమ్మిక సుధాకర్, గాడి సత్యనారాయణ, శేఖర్, బుజ్జి, తిరుపతి పాల్గొన్నారు.

ఆత్మస్తుతి.. పరనింద..

ఎపి పాలనపై ధ్వజం.. మోడీకి భజన

బిజెపి బహిరంగ సభలో అమిత్ షా సహా నేతల తీరు

రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ ఊసే కరువు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'తమను తాము పొగుడుకోవడం ద్వారా ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించేయడం, తాము చేయని పనులను చేసినట్లుగా భావిస్తూ తన్మయత్వంతో ఊగిపోతూ తమ అగ్రనేతలను స్తుతిస్తూ ఊకదంపుడు ఉపన్యాసాలతో సభికులను అలరించడానికి తాపత్రయపడడం' ఆదివారం సాయంత్రం నాటి బిజెపి బహిరంగ సభలో కనిపించింది. కేంద్ర హోం శాఖామాత్యులు అమిత్ షా ఉపన్యాసం ఆద్యంతం ఇలానే సాగింది. తమ తొమ్మిదేళ్ల పాలనను పొగడుకుంటూ.. ప్రపంచం అంతా మోడీ జపమే చేస్తోందంటూ కితాబులతోనూ, గత కాంగ్రెస్ పాలనను దుయ్యబట్టడం, ఎపిలో వైసిపిపై ధ్వజమెత్తడంతోనే అమిత్ షా ఉపన్యాసం అంతా సాగిపోయింది. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ గురించిన మాట అమిత్ షా నోట రాలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊసు కూడా ఎత్తలేదు. కానీ 'కాశ్మీర్ మనదా ? కాదా ? అంటూ మధ్య మధ్యలో 'భారత్ మాతాకి జై' అనే నినాదాన్ని సభికుల నుంచి చెప్పిస్తూ ప్రజలను ఉద్వేగంలో ముంచెత్తేలాగ చేతులెత్తాలంటూ అమిత్ షా గట్టిగా అరుస్తూ మాట్లాడారు. పదేపదే అబద్ధాలు చెప్పుకొచ్చారు.

అంతా మోడీ జపమే !

అమిత్ షా హోం శాఖ మంత్రి అయి ఉండి కూడా దేశంలో మహిళలకు కేంద్రం ఇచ్చే భరోసా, రక్షణ వంటి అంశాలనుగానీ, దేశంలో శాంతి భద్రతల విషయాన్నిగానీ ఎక్కడా ప్రస్తావించలేదు. మోడీ జపం చేస్తూ ఉపన్యాసంలో సగభాగం భజన చేశారు. ప్రపంచం అంతా మోడీని హీరోలా భావిస్తుందంటూ వ్యాఖ్య చేశారు. గత కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడుతూ ఎపిలో జగన్ పాలనపైనా ధ్వజమెత్తాడు. కేంద్రం ఇచ్చే రేషన్ బియ్యానికి జగన్ బొమ్మ తగిలించుకుని సోకులు చేస్తున్నాడన్నారు. విశాఖకు రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలెవరైనా వచ్చారంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడకుండా ఉండరన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనం చేసి దేశ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టాలన్న విధానం తీసుకున్న బిజెపి విశాఖ బ్రాండ్ ఇమేజ్ అయిన స్టీల్‌ప్లాంట్‌పై ఈసారి కనీసం మాట్లాడలేదు. ప్రైవేటీకరణ ఉపసంహరించుకుంటున్నట్టు ఎలాంటి ప్రకటనా చేయలేదు. విశాఖ అభివృద్ధికి కేంద్రం ఏం చర్యలు తీసుకుంటుందో చెప్పకుండా ఇక్కడ సంఘ విద్రోహులు పెరిగిపోయారంటూ హోం మంత్రి వ్యాఖ్యలు చేయడం ఒక రకంగా దిగజారుడుతనంగా చెప్పొచ్చు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇస్తానని ఇవ్వకుండా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న కేంద్రం చర్యలను ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజానీకం, మేధావులు నిరంతరం తప్పుపడుతూనే ఉన్నా దీనిపై నోరెత్తి మాట్లాడలేదు. ఉన్నఫలంగా వాల్తేరు డివిజన్‌ను ఎత్తేసి పాపం మూటగట్టుకున్న బిజెపి వచ్చే ఎన్నికల్లో 300 సీట్లకుపైగా కావాలని, ఎపి నుంచి 20 సీట్లు కావాలని కోరడం అత్యాసే అవుతోంది.

బిజెపి విద్రోహ పాలనపై వామపక్షాలు భగ్గు

విశాఖలో భారీ నిరసన ర్యాలీ

మిన్నంటిన అమిత్‌షా గో బ్యాక్ నినాదాలు

వైజాగ్‌లో అడుగుపెట్టే నైతిక అర్హత అమిత్‌షాకు లేదు :

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఎపికి ప్రత్యేక హోదా లేదు.. రైల్వే జోన్ విషయంలోనూ మోసం చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు రావు. ప్రభుత్వ రంగ ధ్వంసమే లక్ష్యంగా బిజెపి పాలకులు ముందుకు సాగుతున్నారు. అటువంటి వారికి విశాఖలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదు' అంటూ సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు ఆదివారం విశాఖలో కదంతొక్కాయి. 10.30 గంటలకు రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుల నేతృత్వంలో భారీ నిరసన ర్యాలీ సాగింది. విశాఖలో అమిత్ షా పర్యటనను, తొమ్మిదేళ్ల బిజెపి విద్రోహ పాలనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు చేపట్టిన ఈ నిరసన ర్యాలీలో 'అమిత్‌షా గో బ్యాక్' నినాదాలు హోరెత్తాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్దగల మహాకవి గురజాడ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. అక్కడే బహిరంగ సభ నిర్వహించారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ముఖ్యవక్తగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపికి ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, రైల్వే జోన్ వంటి హామీలన్నిటినీ బిజెపి తుంగలో తొక్కిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తూ విశాఖలో పర్యటించే నైతిక హక్కు అమిత్‌షాకు లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు కేంద్రం ఎంతటి అన్యాయం చేసిందో వివరించారు. ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మద్దతుగా నిలవడం శోచనీయమన్నారు. కార్మిక వ్యతిరేక బిల్లులు, దేశానికి ప్రమాదకరమైన చట్టాలన్నిటినీ ఈ పార్టీలు ఆమోదించేసి మోడీ భజనపరులుగా మారాయని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వందల ఎకరాలను గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల పేరిట అదానీకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కట్టబెట్టడం దారుణమన్నారు. గిరిజన ప్రాంత గ్రామసభల అనుమతుల్లేకుండా ధారాదత్తం చేసే విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. దేశంలో పలువురు మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు బిజెపి విద్రోహ విధానాలపై తిరగబడుతున్నారని, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అది చూసి నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మోడీ హయాంలో ప్రజలకు ఎంతటి నష్టం జరిగిందో వివరించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు ఎస్.లక్ష్మి మాట్లాడుతూ నల్లధనాన్ని వెలికితీసి దేశంలో ప్రజలందరి అకౌంట్లలో రూ.15లక్షలు చొప్పున వేస్తానని మోడీ చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అనంతరం ఆప్ రాష్ట్ర యువజన విభాగం కన్వీనర్ కె.గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు క్షేత్రపాల్, కె.విమల, వై.కొండయ్య, డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, ఎస్‌కె.రెహమాన్, చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్వర్లు, రాంబాబు, బి.వెంకట్రావు, పి.మణి, పి.పైడిరాజు, కె.సత్యనారాయణ, ఎం.సుబ్బారావు, పి.చంద్రశేఖర్, కుమారి, గణేష్, ఆష్రఫ్, ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సీతల్ పాల్గొన్నారు.

801వ రోజుకు స్టీల్ జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 801వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే పనిగా ముందుకు సాగుతున్న బిజెపికి రానున్న కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.కృష్ణ, యు.సోమేష్, శ్రీను, కె.నారాయణ, సిహెచ్.రాముడు, ఆర్ఎన్.ఆంజనేయులు, శ్యామ్, సురేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ఎంవిపి.కాలనీ : ఖరగ్‌పూర్ డివిజన్ ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్‌లోని బహనాగ బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 జూన్ 12న 22878 ఎర్నాకులం-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను, జూన్ 13న 22853 షాలిమార్-విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 22807 సంత్రాగచ్చి-ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 22887 హౌరా-సర్ ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 22825 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22604 విల్లుపురం - ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు ఆయన ప్రకటించారు.

సమావేశమైన గిరిజనులు

గిరిజనులంతా ఐక్యంగా కదలాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

తమ హక్కులను, చట్టాలను రక్షించుకునేందుకు గిరిజనులంతా ఏకతాటికి రావాలని బొడ్లంక గ్రామానికి చెందిన డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చావడికోట పంచాయితీ పరిధి బొడ్లంక గ్రామంలో ఆదివారం జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ పంచాయతీ సర్పంచ్ సాదల ప్రేమ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పంచాయతీ పరిధిలోని బొడ్లంక, బంద, చెక్కవాడ, ముంతమామిడి, తేనెల మామిడి, బొడ్డుమాని వీధి తదితర గ్రామాల నుండి యువత అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లాల రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. జిఓ నెంబర్ 52ను తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వం బోయ వాల్మీకి, వెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడం దారుణమన్నారు. గ్రామపంచాయతీల పరిధిలో జేఏసీ కమిటీలు ఏర్పాటు చేసి ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కర్రి సన్యాసిరెడ్డి మాట్లాడుతూ జిఓ 3ను తొలగించడం వలన గిరిజన ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగాలు గిరిజన యువత కోల్పోతుందని తెలిపారు. ఆదివాసీ హక్కులు కోల్పోతున్నామని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతకి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో పల్లాల లచ్చిరెడ్డి, మాజీ ఎంపిపి పల్లాల లక్ష్మీ భూపతిరెడ్డి, పల్లాల రామిరెడ్డి, పల్లాల సూర్య రెడ్డి, కత్తుల రమణారెడ్డి, సాధల ప్రేమ్ కుమార్ రెడ్డి, కత్తుల రత్నారెడ్డి పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో చిన్నారులు

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : స్థానిక శాఖ గ్రంథాలయం వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. గ్రంథాలయాధికారి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జెడ్పిటిసి సభ్యులు గొర్లె బాలాజీ బాబు, ఉప సర్పంచ్ బి వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి బాలాజీ బాబు మాట్లాడుతూ చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరం ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి ఇక్కడ ఉన్న పుస్తకాలను చదవాలని సూచించారు. గత 35 రోజులుగా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, చిన్నారులకు గేమ్స్ నిర్వహించి గెలుపొందిన ప్రతి చిన్నారికి పెద్దల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బి.దేవి, మిస్బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పాల్ బుజ్జి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.